తిరుమలలో భక్తుల రద్దీ

ప్రజాశక్తి- తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వైకుంఠం క్యూ కాంప్లెక్సులు, నారాయణగిరి షెడ్లు భక్తులతో నిండిపోయాయి. శిలాతోరణం క్యూలైన్ వరకు భక్తులు వేచి ఉన్నారు. శ్రీవారి దర్శనానికి ప్రస్తుతం దాదాపు 24గంటల సమయం పడుతోంది. శనివారం 86,781మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నట్లు అధికారులు వెల్లడించారు. 44,920 మంది తలనీలాలు సమర్పించినట్లు తెలిపారు. శ్రీవారికి రూ.3.37కోట్ల హుండీ ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు.

బ్రేక్ దర్శనం రద్దు

శ్రీవారి ఆలయంలో జూలై 17వ తేదీన సాలకట్ల ఆణివార ఆస్థానం నిర్వహించనున్నారు. ఈ పర్వదినాన్ని పురస్కరించుకుని ఈనెల 11వ తేదీన మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో 11న బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. ఈ కారణంగా ఈనెల 10న సోమవారం సిఫారసు లేఖలు స్వీకరించబడవని టిటిడి స్పష్టం చేసింది. ఈవిషయాన్ని భక్తులు గమనించాలని కోరింది.

కలెక్టరేట్ వద్ద

36 గంటలు అంగన్వాడీల నిరసన

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: ఐసిడిఎస్ పరిరక్షణ, అంగన్వాడీ ఉద్యోగుల భద్రత, కనీస వేతనం, గ్రాట్యూటీ, పెన్షన్, పిఎఫ్, ఈఎస్ఐ తదితర సమస్యల పరిష్కారం కోసం దేశవ్యాప్త పిలుపులో భాగంగా అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో తిరుపతి కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమం నిర్వహించనున్నట్లు నేతలు ప్రకటించారు. 10 తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు ధర్నా ప్రారంభమవుతుందని సిఐటియు నేతలు కందారపు మురళి, ఎస్.వాణిశ్రీ, ఆర్.లక్ష్మీ, నాగరాజమ్మలు ఆదివారం సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో పిలుపునిచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రాకముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతుంటే నాలుగున్నర ఏళ్లుగా పట్టించుకోవడంలేదని వారు విమర్శించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది సంవత్సరాలైనా అంగన్వాడీల సమస్యలను దేశవ్యాప్తంగా పరిష్కారం చేయలేదని ఐసిడిఎస్ లక్ష్యానికి విరుద్ధంగా... సెంటర్లను కుదించడానికి నూతన విద్యావిధానాన్ని తీసుకువచ్చారని ఆరోపించారు. ప్రభుత్వ విధానాల ఫలితంగా నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని ఆ మేరకు అంగన్వాడీ వర్కర్లకు, హెల్పర్లకు, మినీ వర్కర్లకు వేతనాలు పెంచలేదని గుర్తుచేశారు. 2018లో వర్కర్‌కు రూ.1500లు హెల్పర్‌కు రూ.750లు మినీ వర్కర్‌కు రూ.1250లు పెంచుతున్నామని ప్రకటన చేసి ఇంతవరకు అమలు చేయలేదని వారు తీవ్రంగా విమర్శించారు. 2017 నుండి టీఏ బిల్లులు ఇవ్వడం లేదని, 2022 ఏప్రిల్ 25న సుప్రీంకోర్టు దేశవ్యాప్తంగా అంగన్వాడీ ఉద్యోగులకు గ్రాట్యూటీని అమలు పరచమని ఆదేశిస్తే నేటివరకు అమలు చేయలేదని విమర్శించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 2023 -24 సంవత్సరానికి ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల 26లక్షల మంది అంగన్వాడీ వర్కర్లు హెల్పర్లతో పాటు కోటి మంది స్కీం వర్కర్లకు ప్రయోజనం కలగలేదన్నారు ఐసీడీఎస్‌కి నామమాత్రంగా 20,263కోట్ల నుంచి 20,554 కోట్లకు బడ్జెట్ పెంచినప్పటికీ పెరుగుతున్న ధరలతో ఇది ఏమాత్రం సరిపోదన్నారు. గత 48 సంవత్సరాల నుంచి గర్భిణులకు, బాలింతలకు, చిన్నపిల్లలకు అవే సేవలు అందిస్తున్న అంగన్వాడీలకు కనీసం ఉద్యోగ భద్రత లేకపోవడం దారుణమని విమర్శించారు. అంగన్వాడీలకు తెలంగాణలో కంటే అదనంగా వేతనాలు ఇస్తానన్న ముఖ్యమంత్రి గారి హామీ... నీటి మీద రాతగా మిగిలిందని, సెంటర్ల నిర్వహణకు పెట్టుబడులు పెట్టాల్సిన పరిస్థితికి అంగన్వాడీలు నెట్టబడ్డారని నేతలు తీవ్రంగా విమర్శించారు. అంగన్వాడీ కేంద్రాల పర్యవేక్షణ పేరుతో ఫుడ్ కమిషనర్, ఎంఎస్కే, ఎమ్మార్వో, ఎండిఓ మరియు, రాజకీయ నాయకులు విజిట్ల పేరుతో అంగన్వాడీలను అవమానిస్తూ నిత్యం వేధింపులకు గురి చేస్తున్నారని గుర్తుచేశారు. ప్రకాశం జిల్లా టంగుటూరు ప్రాజెక్టులో హనుమాయమ్మ అనే అంగన్వాడీ కార్యకర్తను రాజకీయ కక్షలతో నిర్దాక్షిణ్యంగా చంపారని, కనీసం మట్టి ఖర్చులు ఇచ్చే దిక్కు కూడా లేదని వారు వాపోయారు. అంగన్వాడీలసమస్యల పరిష్కారంకై జూలై 10, 11 తేదీల్లో కలెక్టరేట్ వద్ద జరిగే భారీ నిరసన కార్యక్రమాల్లో అంగన్వాడీలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

ఆందోళన బాటలో అంగన్వాడీలు

- సమాన పనికి సమాన వేతనం ఎక్కడ?
- పనిభారంతో పాటు అవమానాలు
- భద్రత లేని ఉద్యోగాలు

ప్రజాశక్తి- తిరుపతిటౌన్

అంగన్వాడీలకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం బుట్టదాఖలు చేసింది. సమాన పనికి సమాన వేతనం ఇవ్వకపోగా రకరకాల యాప్‌ల పేరుతో అంగన్వాడీలను వేధిస్తోంది ప్రభుత్వం. కనీసం ఉద్యోగ భద్రత లేకపోవడంతో పాటు వేతన బకాయిలు చెల్లించడం లేదు. పక్క రాష్ట్రంలో అంగన్వాడీలకు గౌరవ ప్రధమైన వేతనాలు ఇవ్వడమే కాకుండా వారి సమస్యలు పరిష్కరించేలా చర్యలు కూడా తీసుకుంటున్నారు. కానీ ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం ఉపాధి కూలీలకన్నా హీనంగా చూస్తూ చాకిరీ చేయిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణులు, పిల్లలు, బాలింతలకు పోషక విలువతో కూడిన ఆహారం అందిస్తున్న అంగన్వాడీల గురించి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. జీతం పెంచమని అడిగితే వారి ఉద్యమాలను పోలీసుల నిర్బంధంతో దారుణంగా అణచివేస్తున్నారు.

జీతం తక్కువ.. చాకిరీ ఎక్కువగా చేస్తున్నా.. పేరుకే ప్రభుత్వ ఉద్యోగులమని ప్రభుత్వ ఉద్యోగికి ఉండాల్సిన సౌకర్యాలు, కనీస వేతనాలు, పెన్షన్ వంటి సదుపాయాలు వీరికి ఉండటం లేదు. కనీసం వీరికి ప్రభుత్వ సంక్షేమపథకాలు కూడా ఇవ్వడం లేదు. అంగన్వాడీల్లో గర్భిణులు, పిల్లలకు అందించాల్సిన పోషకాహారం మెనూ భారం కూడా వీరిపైనే పడుతోంది. పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం నుంచి నిధులు కేటాయించకపోవడంతో ఆభారమూ వీరే మోయాల్సివస్తోంది. అటు వేతనాలు తక్కువ, ఇటు అదనపు భారం.. దీంతో ప్రభుత్వ అన్యాయాలను ప్రశ్నిస్తు అంగన్‌వాడీలు ఉద్యమానికి సిద్ధమయ్యారు.

ఈనెల 10,11 తేదీలలో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద 36 గంటలపాటు నిరసనకు పూనుకున్నారు. ఇప్పటికే తిరుపతి అర్బన్ ఎస్‌పికి వినతిపత్రం కూడా ఇవ్వడం జరిగింది. జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీలు ఉద్యమంలో పాల్గొనున్నారు. ప్రైవేట్ ఉద్యోగికి ఉండే కనీస భద్రత, భరోసా కూడా వీరికి దూరం, ఇక పెన్షన్ పొందలేని పరిస్థితి. ప్రభుత్వం ఉద్యోగి పేరుతో వారికి ప్రభుత్వం నుంచి అందాల్సిన అన్నిరకాల సంక్షేమ పథకాలు అమలు చేయడం లేదు. తిరుపతి జిల్లాలో సుమారు 4 వేల మందికి అంగన్వాడీ కార్యకర్తలు ఉన్నారు. వీరందరూ తమ న్యాయమైన హక్కులు, సమస్యల పరిష్కారం కొరకు నేడు జరిగే నిరసనలో పాల్గొనున్నారు.

వేతనం తక్కువ.. భారం ఎక్కువ..

అంగన్వాడీ కేంద్రాలకు పోషణ కార్యక్రమానికి ఇచ్చే మెనూ ఛార్జీలు కూడా అంతంత మాత్రంగానే ఉన్నాయి. నాలుగేళ్ల క్రితం ధరల కంటే బహిరంగ మార్కెట్‌లో ప్రస్తుత ధరలు నాలుగింతలు పెరిగాయి. ప్రభుత్వం మెనూ ఛార్జీలు పెంచడం లేదు. దీనికి తోడు వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.1150 నుంచి 1200లగా ఉంది. ఈ మొత్తం భారం అంగన్వాడీలపైనే పడుతుంది. ఇటు వేతనాలు పెంచక అటు మెను చార్జీలు సక్రమంగా ఇవ్వక అంగన్వాడీలు ఇబ్బందులు పడుతున్న తరుణంలో గతంలో చేపట్టిన ఆందోళనకు దిగివచ్చిన ప్రభుత్వం అంగన్‌వాడీ ఉద్యోగులను కూడా సంక్షేమ పథకాలకు అర్హులను చేస్తు గత ఏడాది జీవో జారీ చేసింది. కానీ ఈ జీవో పక్కదారి పట్టింది. జీవో ఉన్న ఒక్క ఉద్యోగికి కూడా సంక్షేమపథకం అందడం లేదు. దీంతో ఉద్యోగులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న ఈ అన్యాయాలను ప్రశ్నిస్తు 36 గంటలు నిరసన దీక్షలు చేయనున్నారు. ఈ నిరసన చూసైనైయిన ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించాలని వారు కోరుతున్నారు.

తెలంగాణ తరహాలో వేతనాలు ఇవ్వాలి
- ఎస్.వాణిశ్రీ, అంగన్వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి

రాష్ట్ర ప్రభుత్వ హామీ ప్రకారం తెలంగాణ రాష్ట్రం కన్నా అదనంగా అంగన్‌వాడీలకు వేతనాలు ఇవ్వాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.వాణిశ్రీ పేర్కొన్నారు. తమ13 డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలి. సుప్రీంకోర్టు తీర్పు మేరకు గ్రాట్యూటీ అమలు చేసి హెల్పర్ల ప్రమోషన్ల వయో పరిమితి 50 ఏళ్లకు పెంచాలి. వేతనంతో కూడిన మెడికల్ లీవు ఇవ్వాలి. సంపూర్ణపోషణకు మెనూ ఛార్జీలు పెంచాలి. సర్వీసులో ఉంచి చనిపోయిన వారి పిల్లలకు ఉద్యోగాలు ఇవ్వాలి. అంగన్వాడీలపై గ్రామాల్లో రాజకీయ నాయకుల వేధింపులు మానుకోవాలి.

సిఎం ఇచ్చిన హామీలు అమలే చేయాలి
- కందారపు మురళి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి

సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలే అమలు చేయమని కోరుతున్నాం. తెలంగాణ రాష్ట్రం కన్నా ఎక్కువ వేతనం ఇస్తామని ప్రకటించారు ఆ ప్రకటన ఏమైంది. సమస్యలపై పోరాడితే వారిపై పోలీసులను ఉపయోగించి బలవంతంగా నిర్బంధాలు చేయడం, అరెస్టు చేయడం సిగ్గుచేటు. పెరిగిన ధరలకు అనుగుణంగా మెను చార్జీలు ఇవ్వడం లేదు. 2017 నుంచి టిఏ బిల్లులు ఇవ్వడం లేదు. అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షణ పేరుతో ఫుడ్ కమీషనర్, ఎంఆర్ఓ, ఎంపిడివోలు ఇతరులు అవమానించడం దారుణం, వారిపై వేధింపులకు గురిచేయడం అన్యాయం. ఈ సమస్యల పరిష్కారం కోసమే తిరుపతి కలెక్టరేట్ కార్యాలయంలో 36 గంటలు నిరవధిక ఆందోళన కార్యక్రమం చేస్తున్నాం.

దూసుకొచ్చిన మృత్యువు

కారును ఢీకొన్న లారీ
ఆరుగురు దుర్మరణం
మృతులంతా విజయవాడ వాసులు

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి

వెంకన్న దర్శనం ముగించుకుని స్వస్థలానికి తిరిగి వెళుతున్న ఓ కుటుంబాన్ని లారీ మృత్యు రూపంలో కబళించింది. అతివేగంగా వస్తున్న లారీ కారును ఢీకొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న ఆరుగురు దుర్మరణం పాలైన దుర్ఘటన ఆదివారం మధ్యాహ్నం తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణంలోని మిట్టకండ్రిగ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు..

సంఘటనా స్థలంలో పడి ఉన్న మృతదేహాలు

విజయవాడ నగరం కృష్ణలంక ప్రాంతానికి చెందిన తుంగల రమేష్ కుటుంబం శుక్రవారం వెంకన్న దర్శనార్థం కారులో తిరుమలకు వచ్చింది. శనివారం వెంకన్న దర్శనం ముగించుకుని ఆదివారం స్వస్థలం విజయవాడలోని కష్ణలంకకు బయలుదేరింది. ఈక్రమంలో మదనపల్లి నాయుడుపేట జాతీయ రహదారి మిట్టకండ్రిగ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ వేగంగా ఢీ కొట్టింది. ఈ సంఘటనలో కారులో ప్రయాణిస్తున్న తుంగల రమేష్(48), ఆయన భార్య రాజ్యలక్ష్మి(40), వదిన శ్రీలత(42), స్నేహితులు రమణి(38), మూర్తి (47), మూర్తి కుమార్తె అక్షయ (16)అక్కడకక్కడే మృతి చెందారు. రమేష్ కుమారుడు భరత్ ప్రాణాలతో బయటపడ్డాడు. స్థానిక సమాచారం మేరకు గాయపడ్డ భరత్‌ను 108లో శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తిరుపతి ఏఎస్పి కులశేఖర్ తెలిపారు. లారీ వేగానికి కారు ముందుభాగం నుజ్జునుజ్జు కావడం, మృతదేహాలు చెల్లా చెదురు పడడంతో జాతీయ రహదారి రక్తసిక్తమైంది. సుమారు గంటపాటు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.

రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగి మృతి

నాగలాపురం: మండలం సురుటుపల్లి చెక్‌పోస్ట్ సమీపంలో పుత్తూరు చెన్నై జాతీయ రహదారిపై ఆదివారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఊతుకోట నుంచి వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న కారు ఢీకొనడంతో ప్రమాదంలో నాగలాపురం మండలం జానికాపురం సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ పని చేస్తున్న సురేష్(31) సంఘటనా స్థలంలో మృతి చెందాడు. మరో వ్యక్తి జానికాపురం వాలంటర్ సతీష్ (25)కు తీవ్రయాలు కాగా మెరుగైన వైద్యం కోసం తమిళనాడు తిరువల్లూరు జిహెచ్ హాస్పిటల్‌కు తరలించినట్లు నాగలాపురం ఎస్ఐ హనుమంతప్ప పేర్కొన్నారు. సురేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్యవేడు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కారు డ్రైవర్‌ను అదుపులో తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నాగలాపురం రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సురేష్

వర్చువల్ విధానంలో ఒబెరాయ్ హోటల్‌కు భూమిపూజ

శంకుస్థాపన చేసిన ముఖ్యమంత్రి

మెరుగైన ఉపాధి అవకాశాలు : కలెక్టర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కడప జిల్లా గండికోట నుంచి ఒబెరాయ్ గ్రూప్ ఆఫ్ హోటల్స్ ప్రతినిధులు విక్రమ్ ఒబెరాయ్, పర్యాటకశాఖ మంత్రి రోజా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్ రెడ్డి తదితరులతో కలిసి వర్చువల్ విధానంలో వైజాగ్, తిరుపతి పట్టణంలో నూతనంగా నిర్మించనున్న ఒబెరాయ్ లగ్జరీ హోటల్స్‌కు భూమిపూజా కార్యక్రమం నిర్వహించి శంకుస్థాపన చేశారు. తిరుపతి జిల్లా ఏపీ టూరిజంశాఖ ట్రాన్స్‌ఫోర్ట్ ఆఫీస్ (పేరూరు - అలిపిరి రోడ్డు) దగ్గర సదరు హోటల్‌కు కేటాయించబడిన ప్రాంతం నుండి ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలమ్, జిల్లాకలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి, జెసి డికే బాలాజీతో కలిసి పాల్గొన్నారు. ఈసందర్భంగా మంత్రి ఆర్కే రోజా వర్చువల్‌గా కడప నుండి ప్రసంగిస్తూ నిబంధనల ప్రకారం రోడ్డు కనెక్టివిటీ, విద్యుత్, నీటి సరఫరా, ఇతర ప్రోత్సాహకాలను అందించడం ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ వ్యవస్థాపకుల పర్యాటక రంగాన్ని ప్రోత్సహిస్తోందని అన్నారు. కలెక్టర్ ముఖ్యమంత్రికి వివరిస్తూ తిరుపతి జిల్లాలో తొలిసారిగా సెవెన్‌స్టార్ ఒబెరాయ్ లగ్జరీ హోటల్ అందుబాటులోకి వచ్చేల కషి చేసిన ముఖ్యమంత్రికి ముందుగా కతజ్ఞతలు తెలిపారు.

తిరుపతి జిల్లాలో ఒబెరాయ్ హోటల్ ఏర్పాటుకు 20 ఎకరాలను సర్వే నం.604/9 పేరూరు గ్రామపరిధిలో, ఏపీ టూరిజంశాఖ ట్రాన్స్‌ఫోర్ట్ ఆఫీస్ (పేరూరు- అలిపిరి రోడ్డు) సమీపంలో కేటాయించడం జరిగిందనీ, ఈ ఒబెరాయ్ లగ్జరీ రిసార్ట్స్ హోటల్ నిర్మాణంలో భాగంగా 100 విలాసవంతమైన స్వతంత్ర విల్లాలు ఏర్పాటు కానున్నాయని, అలాగే మల్టీ కూజన్ వివిధ రకాల వంటకాలు, కాన్ఫరెన్స్ హాల్, బాంకెట్ హాల్, 24గంటలు కాఫీ షాప్, స్విమ్మింగ్ పూల్, ఫిట్నెస్ సెంటర్, స్టేట్‌ఆఫ్ ది ఆర్ట్‌స్పా, సావనీర్ దుకాణాలు పచ్చని ఆరుబయలు, పార్కింగ్ లాంటి మరెన్నో అత్యాధునిక సదుపాయాలతో తిరుపతి జిల్లా ప్రజలకు, ప్రపంచ నలుమూలల నుండి వచ్చే పర్యాటకులకు, యాత్రీకులకు అందుబాటులోకి రానున్నదని తెలిపారు. పర్యాటకరంగం అభివద్ధి వలన రాష్ట్ర ఆర్థిక అభివద్ధికి, ఉపాధి అవకాశాలు మెరుగు పడతాయన్నారు. ప్రభుత్వం నుండి సదరు ఒబెరాయ్ లక్జరీ రిసార్ట్స్ హోటల్ ఏర్పాటుకు అందాల్సిన అన్ని అనుమతులు సదుపాయాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హర్షిత్ పేరూరు సర్పంచ్ కేశవులు, ఎంపీటీసీ చంద్ర మోహన్, జిల్లా పర్యాటకశాఖ ఆర్‌డి రమణప్రసాద్, ఎస్ఈ ఎస్పీడీసీఎల్ కష్ణారెడ్డి, జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ అధికారి బాల కొండయ్య, పర్యాటక కార్పొరేషన్ డివియం గిరిధర్, జిల్లా టూరిజం అధికారి రూపేంద్రనాథ్‌రెడ్డి, టూరిజం ఈఈ సుబ్రమణ్యం పాల్గొన్నారు.

వర్చువల్ విధానంలో ఒబెరాయ్ హోటల్‌కు భూమిపూజ

జిల్లాలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పర్యటన

అప్రమత్తంగా ఏర్పాట్లు చేపట్టాలి: కలెక్టర్

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: జాతీయ రహదారులు, రోడ్డు రవాణాశాఖ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి ఈనెల జూలై 12,13న జిల్లాలో పర్యటించనున్నారని అందుకు తగిన ఏర్పాట్ల కొరకు అధికారులు వారికి కేటాయించిన విధులు సక్రమంగా అప్రమత్తంగా నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణారెడ్డి సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆదివారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జెసి డికే.బాలాజీ, జాతీయ రహదారుల ప్రాంతీయ అధికారి, విజయవాడ రాకేష్ కుమార్ సింఘ్, పిడి జాతీయ రహదారులు నెల్లూరు దేవేశ్ గోయల్, తిరుపతి పిడి వెంకటేశ్వర్లులతో కలిసి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారులు, రోడ్డు రవాణాశాఖ కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి తాత్కాలిక పర్యటన షెడ్యూల్ మేరకు ఈ నెల 12న జిల్లాకు రానున్నరని, 13న ఉదయం తిరుపతి పట్టణంలోని తారక రామ స్టేడియంలో కష్ణపట్నం పోర్టు జాతీయ రహదారుల ప్యాకేజీ 2,3, 4 (పోర్టు కనెక్టివిటీ)కు సంబంధించిన శిలా ఫలకాలను ఆవిష్కరించి శంకుస్థాపన చేసి బహిరంగసభలో పాల్గొననున్నారని తెలిపారు. రేణిగుంట- నాయుడుపేట జాతీయ రహదారి ఎన్హెచ్-71 మార్గంలో ఆజాదీ కా అమత్ మహోత్సవ్‌లో భాగంగా దేశంలోని అన్ని జాతీయ రహదారుల ప్రాంతీయ కార్యాలయాల పరిధిలోని జాతీయ రహదారుల వెంబడి పెద్దఎత్తున సామూహిక మొక్కలు నాటే పాన్‌ఇండియా కార్యక్రమాన్ని తిరుపతి జిల్లా రేణిగుంట ప్రాంతం నుండి కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ప్రారంభించనున్నారని అందుకు తగిన ఏర్పాట్లు పూర్తిస్థాయిలో పగడ్బందీగా జరిగేలా ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా సంబంధిత అధికారుల పర్యవేక్షణ ఉండాలని సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి కోదండ రామిరెడ్డి, ఎస్‌డిసి భాస్కర్ నాయుడు, తిరుపతి ఆర్‌డిఓ కనకనరసారెడ్డి, ఆర్డీవో శ్రీకాళహస్తి రామారావు, ఏపీ ఎస్పీడీసీఎల్ ఎస్ఈ కష్ణారెడ్డి, జిల్లా రవాణా శాఖ అధికారి సీతా రామిరెడ్డి పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు నిదర్శనం 'శ్రీజ'

లక్ష్యాలను చేరుకున్న సభ్యులకు 9.83 కోట్ల బోనస్ : ఛైర్మన్ శ్రీదేవి

ప్రజాశక్తి- తిరుపతి (మంగళం):

పాడి రంగంలో చిత్తూరు జిల్లా కేంద్రంగా పనిచేస్తూ ప్రపంచంలోనే లక్ష మందికిపైగా సభ్యులు కలిగిన ఏకైక 'శ్రీజ' సంస్థ 10 సంవత్సరంలోకి అడుగు పెడుతూ సభ్యుల ఖాతాల్లోకి 10 కోట్ల రూపాయల బోనస్‌ను ఇస్తోంది. శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ అని త్వరలో సంస్థ 1000 కోట్ల టర్నోవర్‌ను సాధించబోతుందని సంస్థ ఛైర్మన్ కుంటపల్లి శ్రీదేవి తెలిపారు. మొత్తంగా 9.83కోట్ల రూపాయలను బోనస్‌గా చెల్లించనున్నారు. ఈ బోనస్‌ను చెల్లించడానికి ఇటీవల జరిగిన బోర్డు సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. శ్రీజ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ జయతీర్థచారి నేతృత్వంలో శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ కంపెనీ సంస్థకు సంబంధించిన అన్ని లావాదేవీలను ఆన్లైన్ ద్వారానే జరుపుతూ నెలకు రెండుసార్లు తమ సభ్యుల బ్యాంకు ఖాతాలలో పాల బిల్లులను నేరుగా జమ చేస్తూ ఎక్కడా కరెన్సీ వాడకం లేకుండా ఆన్లైన్ పద్ధతి ద్వారానే కార్యకలాపాలను జరుపుతున్నామన్నారు. ఘన విజయాలను సాధించడానికి సహకరిస్తున్న ఎన్డీడిబి, ఎన్డీడిబి డైయిరీ సర్వీసెస్, మదర్ డైయిరీకి, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కతజ్ఞతలు తెలిపారు.

సాధారణ మహిళా రైతును ఛైర్మన్‌ను చేశారు
- కుంటపల్లి శ్రీదేవి, ఛైర్మన్ శ్రీజ సంస్థ

మహిళా సాధికారతకు నిదర్శనం శ్రీజ సంస్థ. 2014 నుండి శ్రీజ సంస్థలో డైరెక్టరుగా చేస్తూనే మహిళల ఆర్థిక చైతన్యానికి ఊతమిచ్చే అవకాశాలను, ప్రోత్సాకాలను ఇచ్చారు. 2017 నుండి మహిళల ఖాతాల్లోకి మాత్రమే నగదు బదిలీ చేసేలా చర్యలు తీసుకున్నాం. గత రెండు సంవత్సరాలుగా ఛైర్మన్ హోదాలో సాధారణ మహిళా రైతుగా కొనసాగుతూ సంస్థకు పాలు పోసే వారికి మార్కెట్‌లో ఉండే పోటీధరను ఇవ్వడం చాలా సంతోషం అనిపించింది. 10వ ఏడాదిలోకి అడుగుపెట్టిన శ్రీజ సంస్థ 2025లో దేశంలోని టాప్ 10 డైయిరీలలో స్థానం సంపాదించాలనే లక్ష్యంతో పని చేస్తోంది.

మహిళలదే నిర్ణయాధికారం...
- జయతీర్థాచారి, ఛీఫ్ ఎగ్జిక్యూటివ్, శ్రీజ సంస్థ

పాడి మహిళా రైతులు... కేవలం రైతులుగా గానే కాకుండా సంస్థ నిర్వహిణ భాధ్యతల్లోనూ వారి భాగస్వామ్యం ఉండాలని ఇంటర్, డిగ్రీ వరకు చదివిన వారికి తగిన తర్ఫీదును అందించి వారిదే సంస్థలో నిర్ణయాధికారంగా చేశాం. మహిళల ఆర్థిక అభివృద్ధి లక్ష్యంగా శ్రీజ సంస్థలో పనిచేసేవారందరూ నిర్ణయాత్మక కార్యచరణతో భవిష్యత్తు ప్రణాళికలను సిద్ధం చేసి దానివైపే ప్రయాణం అన్నట్టుగా ముందుకెళ్తున్నాం. శ్రీజ కుంటుంబంలో అందరి పాత్ర చాలా కీలకమైనది. అందరం శ్రీజ సంస్థ లక్ష్యసాధనలో కలిసి పనిచేస్తాం.

మహిళల ఆర్థిక చైతన్యమే శ్రీజ లక్ష్యం....
- అమరేంద్రబాబు, కంపెనీ సెక్రటరీ, శ్రీజ సంస్థ

సమాజంలో పాడి మహిళా రైతులను ఆర్థిక చైతన్యవంతులను చేయడమే లక్ష్యంగా శ్రీజ పనిచేస్తొంది. ఎంఎన్‌సి కంపెనీలలో పనిచేస్తూ 12 ఏళ్ళ అనుభవంతో 2014లో శ్రీజలో చేరాను. ఇక్కడ చేరిన తరువాత సంస్థ లక్ష్యం అర్థం చేసుకోని, దానికి అనుగుణంగా మరింత ఉత్సాహంతో మరిన్ని సంస్కరణలు తీసుకోచ్చాం. శ్రీజలో అందరికి సమాన పనులు, భాధ్యతలు ఉంటాయి. పాలకమండలి శ్రీజ అభివృద్ధి కోసం మంచి పాలసీ నిర్ణయాలను తీసుకొంటుంది. శ్రీజ గురించి చెప్పాలంటే అజ్ఞానం నుండి జ్ఞానం వైపు నడిపించేది గురువు అయితే... మహిళా సాధికారతకు, అభివృద్ధికి పాటుపడేది శ్రీజ అని చెబుతాను.

కరోనా సమయంలో కూడా పాల సేకరణ ఆపలేదు
- ఎస్ఆర్.తిమ్మప్ప, డిప్యూటీ జనరల్ మేనేజర్, శ్రీజ సంస్థ

ముఖ్య అవసరంగా ఉన్న పాలను కరోనా సమయంలో ఎక్కడా కూడా ఆగకుండా వినియోగదారులకు అందించాం. 2017లో శ్రీజలో చేరాను. 2014లో 41 వేల లీటర్లతో ప్రారంభమైన శ్రీజ నేడు దాదాపు 7లక్షల లీటర్లకు చేరుకుంది. ఎన్నో ఆటుపోట్లు మధ్య శ్రీజ మహిళా సాధికారత కోసం పనిచేస్తోంది. పల్లెల్లోని పాడి రైతులకు శ్రీజ మీ సంస్థ.... మీనమ్మకం అని.... వారి సహకారాన్ని అందిపుచ్చుకోగలిగాము. ఇన్నేళ్ళలో దాదాపుగా 5లక్షల మందికి మహిళా సాధికారత, ఆర్థిక అభివృద్ధిపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించాం.

నాణ్యమైన ఉత్పత్తులను అందిస్తున్నాం....
- కె.రామమూర్తి, హెడ్-సేల్స్ మార్కెటింగ్, శ్రీజ సంస్థ

శ్రీజ నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడదు. పాల నుండి పాల ఉత్పత్తుల వరకు. ముఖ్యంగా శ్రీజ దైవిక స్వచ్ఛమైన ఆవునెయ్యి ప్రజలను చేరుకుంది. సామాన్య మధ్య తరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా చిన్నపాటి ఫ్యాకెట్లలో నెయ్యిని అదే నాణ్యతతో అందిస్తున్నాం. 2017లో శ్రీజలో జాయిన్ అయ్యి సేల్స్‌ను పెంచడానికి తిరుపతి పరిసర ప్రాంతాల్లో ఇప్పటికి 17 అవుట్ లెట్ల ద్వారా శ్రీజ ఉత్పత్తులు ప్రజలకు చేరువ చేసాం. దీన్ని భవిష్యత్తులో 50 పెంచాలనే లక్ష్యంతో ఉన్నాం. కరోనా సమయంలో పాల, పాల ఉత్పత్తులు రవాణా చేయడానికి ఇబ్బందులు ఎదుర్కోన్నాం. శ్రీజ మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేస్తుంది.

ఉద్యోగులకు సకాలంలో డీఏలు ఇవ్వాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సిపిఎస్ రద్దు చేస్తానని చెప్పి జీపీఎస్‌ను తీసుకురావడం, కమిటీల పేరుతో కాలయాపన చేస్తున్నారని.. కనీసం డీఏలు సకాలంలో ఇవ్వడం లేదని ఎన్‌టీఏ రాష్ట్ర గౌరవాధ్యక్షులు రెడ్డి రమేష్ అన్నారు. ఆదివారం తిరుపతి రాస్ భవనంలో తిరుపతి జిల్లా కార్యవర్గ సమావేశాన్ని పి.రామమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి రమేష్ మాట్లాడుతూ పిఆర్‌సి బకాయిల విషయంలో గందరగోళం నెలకొనడం తీవ్ర నిరాశకు గురిచేస్తోందని, ప్రభుత్వం ఉద్యోగులపై సానుకూల వైఖరితో వ్యవహరించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్‌టిఏ చిత్తూరు జిల్లా అధ్యక్షులు జయప్రకాష్ మాట్లాడుతూ అప్పర్ ప్రైమరీ పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌ల పోస్టులను ప్రమోషన్స్‌తో భర్తీ చేయాలన్నారు. జిపిఎఫ్ రుణాలు మునుపటిలాగా దరఖాస్తు చేసుకున్న 15 రోజుల లోపు ఇవ్వాలన్నారు. సమావేశంలో సిపిఎస్ నాయకులు సుధాకర్, ఎల్లం నాయుడు, రమణ, గంగాధర్, నాగేశ్వరరావు, హేమకుమార్, రవికుమార్, మురళీ, రమేష్, రామకృష్ణ, వెంకటేశులు, రెడ్డి శేఖర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు 'మనసిస్తావా' చిత్రం విడుదల

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): నేడు సమాజంలో యువత ప్రతి చిన్న విషయాలకు ఆత్మహత్యలకు వైపు వెళ్తూ కన్న వారికి కడుపుకోతను మిగుల్చుతున్నారని, ఆత్మహత్య ఎంత తప్పిదమో చెప్పే చిత్రం మనసిస్తావా చిత్రం అని చిత్ర దర్శకులు రవిచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చిత్ర బృందం మాట్లాడుతూ తిరుపతిలోని యువత, కళాకారులను ప్రోత్సహించడానికి ఈ చిన్న చిత్రంతో సమాజానికి మంచి సందేశాన్ని ఇస్తున్నామన్నారు. కోటి రూపాయల ఖర్చుతో నిర్మించిన ఈ చిన్న చిత్రాన్ని సోమవారం థియేటర్లలో విడుదల అయ్యే మనసిస్తావా సినిమాను ప్రజలు ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో నిర్మాతలు శివారెడ్డి, నక్కా రాజేంద్రప్రసాద్, నటులు కృష్ణమూర్తి, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

లోకేష్ మాటలకు ప్రేరేపితమయ్యే దాడులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి ఆటోనగర్‌లో ఎదుగుతున్న యువ నాయకుడు, ప్రస్తుత వైసిపి జిల్లా యువజన విభాగం అధ్యక్షులు ఆరే అజయ్‌కుమార్‌పై అదే ప్రాంతానికి చెందిన టిడిపి యువతకు చెందిన జ్ఞానేశ్వర్ (అలియాస్ నాని), మంగళంకు చెందిన సతీష్ అలియాస్ నాని, 30 మంది యువకులతో కలిసి దాడులకు తెగబడడం చూస్తుంటే నారా లోకేష్ యువగళం పాదయాత్రలో ఎక్కువ కేసులు నమోదయిన వారికి అధికారంలోకి వచ్చిన వెంటనే నామినేటెడ్ పదవులు ఇస్తానని చెప్పడంతో టిడిపి యువత నాయకులు దాడులకు తెగబడుతున్నారని వైసిపి నాయకులు పసుపులేటి సురేష్ ఎద్దేవా చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హింసను ప్రేరేపితం చేసే విధంగా టిడిపి నాయకులు.. ఇలాంటి దాడులు చేస్తే ప్రతి దాడులు చేయాల్సివస్తుందని హెచ్చరించారు. ఇలాంటి వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దీనా, సాయి, శివ, బాలాజీ, ప్రసాద్, హరి, వినోద్ పాల్గొన్నారు.

'వాకర్స్'తో సేవా కార్యక్రమాలు చేయాలి



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: నడకతో పాటు సేవా కార్యక్రమాలను చేసేందుకు కృషి చేయాలని నగరి కమిషనర్ వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ సర్వ సభ్య సమావేశాన్ని అధ్యక్షుడు రామచంద్ర నాయుడు, గౌరవ అధ్యక్షులు డాక్టర్ రవిరాజు, వాకర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వాకర్స్ అసోసియేషన్ ముఖ్యమైన కార్యక్రమాలు చేపడుతోందని.. చాలా సంతోషకరమన్నారు. ప్రతిఒక్కరూ సేవాభావం కలిగి ఉండాలని తెలిపారు. డాక్టర్ రవిరాజు మాట్లాడుతూ సీజన్‌లో డెంగీ వచ్చే అవకాశం ఉందని.. ప్రతిఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని.. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు దాత కేకేసీ కళాశాల ఛైర్మన్ కుప్పయ్యశెట్టి, నరసింహారావు ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో కార్యదర్శి రఘునాథం, ట్రెజరర్ గుణశేఖర్‌రెడ్డి, యుగంధర్‌రాజు, మురుగేషన్‌రెడ్డి, కృష్ణమూర్తి, ద్వారకనాథశెట్టి, సభ్యులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట ధర్నా విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-వెంకటగిరి: కలెక్టరేట్ ఎదుట ధర్నా విజయవంతం చేయాలని ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ వెంకటగిరి ప్రాజెక్టు అధ్యక్షులు మంజుల కోరారు. ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో బ్యాండ్‌పాలెం వద్ద విలేకర్లతో మాట్లాడారు. సీఐటీయు జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ అంగన్‌వాడీల కోర్కెల దినం సందర్భంగా జూలై 10, 11 తేదీలలో యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు 36 గంటల పాటు కలెక్టరేట్ కార్యాలయం వద్ద ధర్నా జరుగుతుందన్నారు. అంగన్వాడీ టీచర్లు, హెల్పర్లు పాల్గొనాలని కోరారు.

పడకేసిన పారిశుద్ధ్యం..!

- పచ్చూరుచేనులో రోడ్డుపైనే మురుగునీరు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-బాలాయపల్లి: ఇంట్లో వాడుతున్న మురుగునీరు రోడ్డుపైకి ప్రవహిస్తుండటంతో తారు రోడ్డు గుంతలుగా ఏర్పడి ప్రమా దాలు జరుగుతున్నా రోడ్డు భవనాలశాఖ అధికారులు తమకెందుకు అని నిర్లక్ష్య ధోరణిలో వ్యవహరిస్తున్నారు. వెంకటగిరి-గూడూరు ప్రధాని రోడ్డు మార్గం బాలాయపల్లి మండలంలోని పచ్చూరుచేను గ్రామంలో రోడ్డుపైనే మురుగునీరు పారుతోంది. ప్రధాన రహదారి అపరిశుభ్రంగా ఉంటోంది. ఇక ప్రధాన కూడలి రహదారిలో గడిచిన దశాబ్ద కాలంగా రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు సమీపంలో ఇళ్ల నుండి వాడుక నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. అధికారులకు, నాయకులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు అధ్వాన స్థితికి చేరుకోవడంతో పాటు మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తూ ఉండటంతో తరచూ ప్రమా దాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధానంగా రాత్రి సమయంలో పాదచారులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. వెంకటగిరి నుంచి గూడూరుకు వెళ్లే రహదారి రద్దీగా ఉంటుంది. నాయకులు గ్రామాన్ని దర్శించి వెళ్లారే గాని ఎటువంటి హామీలు, నిధులు మంజూరు చేయలేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు నాయకులు స్పందించి రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

పుత్తూరులో మురుగునీరుతో అవస్థలు

పుత్తూరు టౌన్: పట్టణంలోని 14 వార్డు షాపువీధి ఎక్స్‌టెన్షన్‌లో డ్రైనేజీ కాలువ లేక మురుగునీరు నిండి దోమలకు నిలయంగా మారింది. గతంలో మున్సిపల్ అధికారులకు డ్రైనేజీ కాలువల నిర్మాణం చేపట్టాలని ఫిర్యాదులు చేసినా కాలయాపన చేస్తున్నారు. మురుగునీటి నిల్వతో స్థానికులు ఉరోగాల బారిన పడి ఆసుపత్రులకు పరుగులు తీస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి డ్రైనేజీ కాలువ నిర్మాణం చేపట్టాలనిఆ ప్రజలు కోరుతున్నారు.

మహాభారతం ఉత్సవాలకు రూ.1,01,116 వితరణ

ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతి రూరల్ మండలం ముండ్లపూడి గ్రామంలో జరుగుతున్న మహాభారతం ఉత్సవాలకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి రూ.1,01,116 వితరణ చేశారు. ఆదివారం గ్రామంలో జరుగుతున్న ఉత్సవాలు తిలకించేందుకు వెళ్లిన హర్షిత్ రెడ్డికి గ్రామ పెద్దలు ఘన స్వాగతం పలికారు. ద్రౌపతీ సమేత ధర్మరాజుల ఆలయంలో దర్శన ఏర్పాట్లు చేశారు. ఆ తర్వాత మహాభారతం ఉత్సవ కమిటీకి నగదును అందజేశారు. హరికథ చెబుతున్న వారికి రెండు వేలు బహుమతిగా అందించారు.

విద్యార్థినికి ఆర్థిక చేయూత

ప్రజాశక్తి-ఓజిలి: ఇంటర్ పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ ఉత్తీర్ణత సాధించిన గోకర్ణ శతికి వైసీపీ సీనియర్ నాయకుడు పాల్చూరు పెద్ద చంగయ్య యాదవ్ రూ.10 వేలు ఆర్థిక చేయూతనిచ్చారు. ఓజిలి మండలం అత్తివరం గ్రామపంచాయతీ పరిధిలోని కారూరు గ్రామంలో ఇంటర్ పరీక్ష ఫలితాలలో 983 సాధించిన విద్యార్థిని ఉన్నత విద్యకు ఆర్థిక సహాయంగా పెద్ద చెంగయ్య శ్రీధర్ రెడ్డి, అమరేంద్ర యాదవ్ చేతుల మీదుగా నగదును అందజేశారు. ప్రతి ఏడాది వైయస్సార్ జయంతి రోజు పేద విద్యార్థుల ఉన్నత విద్య కోసం ఆర్థిక సాయం అందజేయడం జరుగుతుందని పాల్చూరు అమరేంద్ర యాదవ్ తెలిపారు.

ముండ్లపూడిలో ఘనంగా మహాభారత ఉత్సవాలు

- రూ.1,01,116, పట్టువస్త్రాలు అందించిన పులివర్తి సుధారెడ్డి

ప్రజాశక్తి-తిరుచానూరు: తిరుపతి రూరల్ మండలం ముండ్లపూడి గ్రామంలో మహాభారతం ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ చిత్తూరు పార్లమెంటరీ అధ్యక్షుడు, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి ద్రౌపది సమేత ధర్మరాజు స్వామి వారికి రూ 1,01,116/- విరాళంతో పాటు పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యకర్తలు ఎవరికి వారు స్వచ్ఛందంగా విరాళాలు అందజేశారు. గ్రామ పెద్దలు, ఆలయ అధికారులు, స్థానిక నేతలు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఉత్సవాలలో భాగంగా దుర్యోధన వద ఘట్టాన్ని ఆమె తిలకించారు. మన సంస్కృతి సాంప్రదాయాలను కళ్లకు కట్టినట్లు రక్తికట్టిస్తున్న కళాకారులను అభినందించారు.

దళితులపై అనుచిత వ్యాఖ్యలు తగదు

ప్రజాశక్తి-గూడూరు: దళితులపై అనుచిత వ్యాఖ్యలు తగదని..ఇటీవల వైసీపీ ఎన్ఆర్ఐ విభాగానికి చెందిన పంచ్ ప్రభాకర్ అనే వ్యక్తి దళితులను దుర్భాషలాడి, బూతులు తిడుతూ దళితుల మనోభావాలను దెబ్బతీసే విధంగా మాట్లాడటంతో సోషల్ మీడియాలో ఇతని వీడియోలు హల్చల్ చేయడం జరిగిందని.. అతనిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘాలు డిమాండు చేశాయి. ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ పంచ్ ప్రభాకర్ ఆంధ్రప్రదేశ్‌లో అడుగుపెడితే బుద్ధి చెప్పేందుకు దళితులందరూ సిద్ధంగా ఉన్నారని తెలియజేశారు. పట్టణ ఎస్సీసెల్ అధ్యక్షులు పల్లి కోటేశ్వరరావు, నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షులు ఏసుపాక పెంచలయ్య, పార్లమెంట్ మహిళా కార్యదర్శి గుండాల భారతి, పార్లమెంట్ ఎస్సీసెల్ సభ్యులు బట్టేపాటి వెంకటకష్ణయ్య, పర్వతాల నాగేంద్ర, పట్టణ కమిటీ ప్రధాన కార్యదర్శి కుంచం మల్లికార్జున్ పాల్గొన్నారు.

తెలుగుదేశం స్థాపనతో ఆత్మగౌరవం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: తెలుగు వారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ అని నగరి నియోజకవర్గ టీడీపీ ఇంఛార్జ్ గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. తానా(ఉత్తర అమెరికా తెలుగు సంఘం) మహాసభల సందర్భంగా రెండో రోజు టీడీపీ రాజ్యసభ సభ్యులు కనకమేడల రవీంద్రకుమార్, ఎన్ఆర్ఐ తెలుగుదేశం అధ్యక్షులు సతీష్ వేమన, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు పులివర్తి నానితోపాటు ప్రవాసాంధ్రులతో కలిసి గాలి భానుప్రకాష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా భానుప్రకాష్ మాట్లాడుతూ తెలుగు వారిని సైతం మద్రాసీలుగా పిలువబడుతున్న రోజుల్లో తెలుగు వారి ఆత్మగౌరవం కాపాడటం కోసం తెలుగుదేశం పార్టీని స్థాపించి తొమ్మిది నెలల్లో అధికారంలోకి వచ్చి చరిత్ర సష్టించిన వ్యక్తి ఎన్టీఆర్ అని తెలిపారు. నేడు ఆ మహనీయుడి పేరిట ప్రాంగాణం ప్రారంభోత్సవంలో పాల్గొనడం తమ అదష్టంగా భావిస్తున్నట్లు పేర్కొన్నారు. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఐటీ రంగాన్ని అభివద్ధి చేయడానికి చంద్రబాబు గారు తీవ్రంగా కృషి చేయడం వల్లనే నేడు అమెరికా వంటి దేశంలో లక్షల్లో తెలుగు ఐటీ నిపుణులు. వనిచేస్తున్నారని.. ఇక్కడే స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకున్నారని తెలిపారు. నాలుగు లక్షల మంది ప్రవాసాంధ్రులు కలిసి తానా(ఉత్తర అమెరికా తెలుగు సంఘం) పేరిట సంఘంగా ఏర్పడటం.. ప్రతి ఏటా తానా మహాసభల పేరిట ఏర్పాటు చేసి ప్రముఖ తెలుగు వ్యక్తులను పిలిచి వైభవంగా కార్యక్రమాలు నిర్వహించడం గొప్పవిషయం. ముఖ్యంగా ఇంత గొప్ప సమావేశాలకు తనను ఆహ్వానించడంతో తాను చాలా గర్వపడుతున్నానన్నారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ తెలుగుదేశం అభిమానులు గొట్టి హేమకుమార్, నవీన్, తులసీరామ్, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ కృషి ఫలితమే పశువైద్య విశ్వవిద్యాలయం

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విద్యాలయం విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసిన ఘనత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డికి దక్కుతుందని విస్తరణ సంచాలకులు డాక్టర్ జి వెంకట్ నాయుడు పేర్కొన్నారు. శ్రీ వేంకటేశ్వర పశువైద్య విషయం విద్యాలయంలో నియంత్ర పశువైద్య విద్యా, సమాచార కేంద్రం ఆధ్వర్యంలో డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి ఉత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పశువైద్యాన్ని మెరుగుపరిచేందుకు, పశుసంవర్ధక, పశుపోషణ కార్యక్రమాలను విస్తత పరిచేందుకు తిరుపతి ప్రధాన కేంద్రంగా శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయాన్ని ఆయన ఏర్పాటు చేశారని కొనియాడారు. రాష్ట్ర సమగ్ర అభివృద్ధి కోసం డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డికి అనన్య సామాన్యమైనదని అన్నారు. ఈ సందర్భంగా డీన్ ఆఫ్ స్టూడెంట్స్ అఫైర్స్ డాక్టర్ జివి.రమణ, సిసివిఈసి కోఆర్డినేటర్ డాక్టర్ కే. సుజాత, డిప్యూటీ రిజిస్ట్రార్ రామ్మోహన్ తదితరులు వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. కార్యక్రమంలో పశువైద్య విద్యా సమాచార కేంద్రం అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీనివాసుల మృతికి సంతాపం

ప్రజాశక్తి-నాయుడుపేట: నాయుడుపేట బాలాజీ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు, నాయుడుపేట మున్సిపాలిటీ 24వ వార్డు కౌన్సిలర్ ధారా రవి సోదరుడు ధారా శ్రీనివాసులు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం ఉదయం ఆరోగ్యం మరింత క్షీణించడంతో చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. అక్కడ హాస్పిటల్ లో చికిత్స పొందుతూ రాత్రి కన్నుమూశారు. సమాచారం తెలుసుకున్న నాయుడుపేటలోని పలువురు వైసీపీ, టిడిపి నాయకులు పార్థీవ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మృతుడి సోదరుడు రవిని పరామర్శించారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, మాజీ మంత్రి పరసా వెంకటరత్నయ్య, టిడిపి సీనియర్ నాయకులు విజయభాస్కర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, వైసీపీ పట్టణ సీనియర్ నాయకులు రాజారెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, జయరామయ్య, చంద్రారెడ్డి, రాహుల్, శేఖర్, మున్సిపల్ కౌన్సిలర్లు లక్ష్మీనారాయణరెడ్డి, అశోక్ కుమార్ తదితరులు నివాళు లర్పించారు.

దివ్యాంగులకు ఇంద్రసేనమ్మ చేయూత

ప్రజాశక్తి-గూడూరు టౌన్: గూడూరు పట్టణంలోని డి.ఎస్.ఆర్ కమ్యూనిటీ హాల్‌లో సింహపురిరెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సిద్ధారెడ్డి ఇంద్రసేనమ్మ దాతృత్వంతో సిద్ధారెడ్డి జనార్ధన్‌రెడ్డి దివ్యాంగులకు ఆదివారం ఫల సరుకులు పంపిణీ చేశారు. సిద్ధారెడ్డి ఇంద్ర సేనమ్మ మాట్లాడుతూ సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆయన పేరు మీదుగా సిద్ధారెడ్డి దివ్యాంగులకు చేయూతనివ్వడం సంతోషంగా ఉందన్నారు. ప్రతిఒక్కరూ సేవా దక్పథాన్ని అలవరచుకోవాలన్నారు. అనంతరం కొత్తపల్లి సనత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ అనేక సేవా కార్యక్రమాలకు ప్రాణం పోసినటువంటి సిద్ధారెడ్డి జనార్ధన్ రెడ్డి, వారి కుటుంబానికి రెడ్డి సంక్షేమ సంఘం ఎప్పుడు రుణపడి ఉంటుందని, ఆయన సేవలు ఎనలేనివి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ధనుంజయ రెడ్డి , కార్యదర్శి ప్రజేంద్ర రెడ్డి, సంఘ ప్రతినిధులు మండి శ్రీనివాసులు రెడ్డి, హరినాథ్ రెడ్డి, జైపాల్ రెడ్డి , సిద్ధారెడ్డి, భాస్కర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

10 నుంచి మెట్లోత్సవం

ప్రజాశక్తి- తిరుమల: టీటీడీ ఆధ్వర్యంలో ఈనెల 10 నుండి 12వ తేదీ వరకు తిరుపతిలోని రైల్వేస్టేషన్ వెనుక గల గోవిందరాజస్వామి సత్రాల్లో శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవం జరుగనుంది. ఈ మూడు రోజుల పాటు ఉదయం భజన మండళ్లతో సుప్రభాతం, సామూహిక భజన కార్యక్రమాలు చేపడతారు. సాయంత్రం సంగీత విభావరి, ప్రవచన కార్యక్రమాలు ఉంటాయి. 10న సాయంత్రం 4 గంటలకు శ్రీ గోవిందరాజ స్వామివారి ఆలయం నుండి మూడో సత్రం ప్రాంగణం వరకు శోభాయాత్ర నిర్వహిస్తారు. సాయంత్రం అధికార ప్రముఖులు సందేశం ఉంటుంది. 12వ తేదీ ఉదయం 4 గంటలకు అలిపిరి పాదాల మండపం వద్ద మెట్లపూజ నిర్వహిస్తారు. అనంతరం వేల సంఖ్యలో వచ్చే భజన మండళ్ల సభ్యులతో సాంప్రదాయ భజనలు చేస్తూ సప్తగిరీశుని చేరుకుంటారు. గతంలో ఎందరో మహనీయులు భక్తిప్రపత్తులతో వేంకటాద్రి పర్వతాన్ని కాలినడక అధిరోహించి స్వామివారి అనుగ్రహం పొందారు. అలాంటివారి అడుగుజాడలలో నడిచి ఆ దేవదేవుని కపకు అందరూ పాత్రులు కావాలనే తలంపుతో దాస సాహిత్య ప్రాజెక్టు మెట్లోత్సవ కార్యక్రమం నిర్వహిస్తోంది.

ఫోక్సో చట్టంపై కేసు నమోదు

ప్రజాశక్తి-వెంకటగిరి: బంగారుపేట ఎంపీపీ స్కూల్లో సంఘటన మరువక ముందే అదే పాఠశాలలో మరో ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి సోమవారం రిమాండుకు తరలిస్తున్నట్లు దిశ డీఎస్పీ కాటమరాజు తెలిపారు. ఆదివారం బంగారుపేటలోని అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో విద్యార్థిని తల్లిదండ్రులు, స్థానికులతో విచారించిన అనంతరం ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు ఉన్న బాలికలపై ఎలాంటి లైంగిక వేధింపులకు గురిచేసినా వారిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండుకు పంపుతామన్నారు. కార్యక్రమంలో వెంకటగిరి ఎస్సై నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి -గూడూరు : రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని.. సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి హెచ్చరించారు. గూడూరు పట్టణంలోని సబ్ డివిజనల్ పోలీస్ కార్యాలయంలో రౌడీ షీటర్లకు ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ తెలుసో తెలియకో నేరాలకు పాల్పడి రౌడీ షీటర్లుగా ఉన్నవారు సత్ప్రవర్తనతో ఉండాలని.. అటువంటి వారిపై రౌడీ షీట్లు తొలగించడం జరుగుతుందని తెలిపారు. అల్లర్లు, గొడవలు సష్టిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని.. ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో రూరల్ సీఐ దశరథ రామారావు సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: పల్లమాల పంచాయతీలోని సచివాలయానికి 15 లక్షల నిధులు మంజూరు కాగా.. రూ.5 లక్షలతో శుద్ధమడుగు గిరిజనకాలనీకు 210 మీటర్ల సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ జొన్నల రమణమ్మ, వైసీపీ ప్రధాన కార్యదర్శి గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభించారు. గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : బీడీ కార్మికులకు ఫ్యాక్టరీ యజమానులే వెయ్యి బీడీలకు రూ.500 చెల్లించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక గేట్ పుత్తూరులో బీడీ కార్మికులతో కలిసి ఆదివారం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, చిత్తూరు జిల్లా అధ్యక్షులు చైతన్య మాట్లాడుతూ బీడీలకు రింగ్‌లేబుల్ వేసే వర్కర్లకు కూలీ రేట్లు పెంచాలన్నారు. బీడీ కార్మికులకు బీడీ ఫ్యాక్టరీ యజమానులు తక్కువ కూలి ఇచ్చి కార్మికులను పస్తులు పెడుతున్నారని విమర్శించారు. చట్ట ప్రకారం బీడీ కార్మికులకు ఇచ్చే కూలిలో కోత పెట్టరాదని.. కార్మిక శాఖ అధికారులు వెంటనే జోక్యం చేసుకుని కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో అఖిల భారత బీడీ కార్మిక ప్రధాన కార్యదర్శి డెబిసిస్ రాయ్ పాల్గొన్నారు.

గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు చేయండి

ఎంపీ గురుమూర్తి

ప్రజాశక్తి- తిరుపతిటౌన్: తిరుపతి, శ్రీకాళహస్తి పరిసర ప్రాంతాలలో గూగుల్ డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయడంపై గూగుల్ ఇంజనీరింగ్ సీనియర్ డైరెక్టర్ రామ గోవిందరాజుతో తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి, శ్రీకాళహస్తి, శాసనసభ్యులు బియ్యపు మధుసూదనరెడ్డి చర్చలు జరిపారు. తిరుపతి ప్రాంతంలో డేటా సెంటర్ ఏర్పాటు చేసేందుకు తగిన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని అందుకు సంబంధించిన వీడియోని వారికి చూపిస్తూ వివరించారు. ఈనెల 21వ తేదీన తమ భారత పర్యటనలో ఈ విషయంపై చర్చిస్తామని గూగుల్ ఇంజనీరింగ్ సీనియర్ డైరెక్టర్ తెలియజేశారని ఎంపి గురుమూర్తి తెలియజేశారు.

పోలవరం నిర్వాసితులకు సీపీఎం విరాళాల సేకరణ

ప్రజాశక్తి-సూళ్లూరుపేట: పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల సంక్షేమం కోసం ఆదివారం సూళ్లూరుపేటలో సీపీఎం నాయకులు విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో నాయకులు బి.పద్మనాభయ్య, ఎస్.అల్లెయ్య, సిఐటియు నాయకులు సిహెచ్.సుధాకరరావు, మనోహర్, వేణు, విజయ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు సోలార్ లైట్లు : పెద్దిరెడ్డి

పుంగనూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పేదలపక్షాన ఉన్నాడని అర్హులైన ప్రతిఒక్కరికి పథకాల ఇస్తూ సుపరిపాలన అందిస్తున్నారని రాష్ట్ర భూగర్భ, విద్యుత్ శాఖ మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. తోపుడుబండ్లు కలిగిన చిరువ్యాపారులు రాత్రిపూట వ్యాపారం చేసేందుకు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఉచితంగా సోలార్ లైట్లు ఆదివారం పంపిణీ చేశారు. ఈకార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ హలీంబాషా అధ్యక్షతన నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ పుంగనూరు నియోజకవర్గంలో 750 సోలార్ లైట్లు రూ.30 లక్షలతో పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ సోలార్ లైట్లు తోపుడు బండ్ల వ్యాపారస్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు.ప్రభుత్వ సంక్షేమపథకాల లబ్ధి పొందేందుకు అవసరమైన ధ్రువపత్రాల మంజూరు నిమిత్తం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.